శుక్రవారం 4 అక్టోబర్ 2024

# తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 71 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

**విలేకరులు కావలెను**

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834



## రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు

- గుర్తింపు కార్డు ద్వారానే ఇందిరమ్మ ఇళ్లు , పింఛన్లు ప్రభుత్వ పథకాలు అన్నీ డిజిటల్ కార్డు ద్వారానే వస్తాయి
- కుటుంబ సభ్యుల సంఖ్య ఒక గ్రూప్ ఫోటో లాంటి వివరాలు మాత్రమే అడుగుతారు
- గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు
- రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్

రాష్ట్రంలో ఆధార్ కార్డు వలె ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా గురువారం కరీంనగర్ నియోజకవర్గంలో తహేర్ కొండాపూర్ లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు నమోదు కార్యక్రమాన్ని రవాణా మరియు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. స్వయంగా తాహేర్ కొండాపూర్ గ్రామంలో పలు నివాసాలకు వెళ్లి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ నమోదు చేశారు.ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యుల సంఖ్య గుర్తింపు ఫోటో తదితర వాటి వివరాలు సేకరణ - మిగతా 3లో

### కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో చేసింది

# తప్పులు.. అప్పులే

- కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన తప్పులను సరిదిద్దితున్నాం
- పదేళ్లు అధికారంలో ఉన్నవారు కంటోన్మెంట్ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నియామకాలు చేపట్టామని
- కిరాయి మనుషులతో బీఆర్ఎస్ నేతలు చేసే హడావుడి తెలంగాణ సమాజం గమనిస్తోంది
- సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయొచ్చు కానీ.. మూసీని అభివృద్ధి చేయొద్దా
- కేటీఆర్, హరీష్‌రావులు మాట్లాడిన జిరాక్స్ కాపీ తీసుకుని ఈటల మాట్లాడుతున్నారు
- పార్టీ మారినా ఈటలకు పాత వాసనలు పోలేదు.




హైదరాబాద్

కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో చేసింది తప్పులు.. అప్పులే.. వీటితో తెలంగాణ నిండా మునిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆ తప్పులు... అప్పులను సరిదిద్దుతూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నవారు కంటోన్మెంట్ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక కేంద్రానికి భూ బదలాయింపు ద్వారా కంటోన్మెంట్ ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కల్వకుంట్ల కుటుంబం అధికారంతో పాటు విచక్షణ కోల్పోయిందని ఎద్దేవా చేశారు.. పదేళ్ల నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - మిగతా 3లో



## బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయి

- బీఆర్ఎస్, బీజేపీపై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు..
- అందుకే ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారు
- ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలా అని మేము చూస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది
- సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, రాతలు రాపిస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు



## ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారు

- సుప్రీం కోర్టుకు విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవరిస్తున్నారు
- సుప్రీంకోర్టు తీర్పును సీఎం స్వాగతించారన్న మంద కృష్ణ
- తీర్పును అమలు చేయడంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్య
- ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు చెప్పిందన్న మంద కృష్ణ



## హెచ్‌సీఏలో 20 కోట్ల ఫ్రాడ్

- అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు
- 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు
- కాంగ్రెస్ నాయకుడికి దర్యాప్తు సంస్థ సమన్లు పంపడం ఇదే మొదటిసారి.
- నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఆర్ నమోదు

# ఎమ్మెల్యే అనర్హత వేటు..

# స్టే ఇచ్చేందుకు నిరాకరణ

- తెలంగాణ హైకోర్టు మరో కీలక నిర్ణయం
- సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను తిరస్కరించిన హైకోర్టు డివిజన్ బెంచ్
- నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది
- నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది.
- తదుపరి వాదనలు 24న వింటామన్న కోర్టు



హైదరాబాద్

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల కేసు మరో కీలక పరిణామం జరిగింది. గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేయాలన్న అసెంబ్లీ సెక్రటరీ అభ్యర్థనను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించింది. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ విషయంపై ఈనెల 24న వాదనలను వింటామని తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున విజయం సాధించి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సహా పలువురు వేసిన పిటిషన్ హైకోర్టు డివిజన్ బెంచ్ విచారించింది. నెల రోజులు క్రితం సెప్టెంబర్ 9న విచారణ - మిగతా 3లో



### మార్పు మార్పు అంటూ

## కాంగ్రెస్ మోసం చేసింది

- పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం
- పత్రికలో వచ్చిన కథనాన్ని ట్వీట్‌కు జత చేసిన కేటీఆర్
- అనుభవరాహిత్యం వల్లే ప్రభుత్వ ఆదాయం పడిపోతోందన్న కేటీఆర్
- సంపదను సృష్టించి పేదలకు పంచే తెలివి సీఎంకు లేకపోవడమే సమస్య అని వ్యాఖ్య



## జైలు ఖైదీల్లో కులవివక్ష సరికాదు

- జైళ్లలో కుల వివక్షపై సుప్రీం కోర్టు చారిత్రక తీర్పు
- అన్ని కులాలకు చెందిన ఖైదీలను మానవత్వంతో, సమానంగా చూడాలి
- పని విషయంలో సమాన హక్కు కల్పించాలి
- షెడ్యూల్డ్ కులాల ఖైదీలకే క్లీనింగ్ పనులు అప్పగించడం విస్మయం కలిగిస్తోంది

# హైబాక్స్ సిండికేట్ కేసులో ఐదుగురికి సమన్లు జారీ చేసిన పోలీసులు


హైబాక్స్ మొబైల్ అప్లికేషన్ ద్వారా భారీగా పెట్టుబడి పెట్టడంతో పలువురు తీవ్రంగా నష్టపోయిన ఘటనలో దేశ రాజధాని న్యూఢిల్లీ పోలీసులు గురువారం చర్యలకు ఉపక్రమించారు. ఈ యాప్‌తో పెట్టుబడులు పెట్టాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన ఐదుగురు ప్రముఖ వ్యక్తులకు పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈ సమన్లు జారీ చేసిన వారిలో.. ఎల్‌విష్ యాదవ్, భారతీ సింగ్ తదితరులు సైతం ఉన్నారు. ఈ మొబైల్ యాప్ ద్వారా దాదాపు రూ. 500 కోట్లు మేర పెట్టుబడి పెట్టి ప్రజలు నష్టపోయారు. పెట్టుబడులు పెట్టే సమయంలో మీ పెట్టుబడులను తిరిగి ఇస్తామని వారు నమ్మించారు. కానీ పెట్టుబడి పెట్టిన నగదును మాత్రం వారు అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు ప్రజలు గుర్తించారు. ఆ క్రమంలో వారు ఢిల్లీ పోలీసులను ఆశ్రయించారు. దీంతో




పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. ఈ యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టాలంటూ ప్రజలపై వీరు తీవ్ర ప్రభావం చూపించారు. దీంతో ఈ కేసు విచారణలో భాగంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులోభాగంగా వీరికి సమన్లు జారీ చేశారు. ఈ యాప్‌పై దాదాపు ఐదు వందల మంది ఫిర్యాదు చేశారని పోలీసు ఉన్నతాధికారి వెల్లడించారు. వీరి ప్రచారం కారణంగా దాదాపు 30 వేల మంది నష్టపోయారని తెలిపారు. ఈ కేసులో బాధితులుగా మారిన వారంతా యూట్యూబర్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్‌ల ద్వారా ఈ యాప్‌కు పరిచయమైనవారేనని స్పష్టం చేశారు. అలాగే ఆ యా ప్రముఖులకు చెందిన లక్షలాది మంది అనుచరులు సైతం ఈ యాప్‌కు ప్రచారం చేశారని వివరించారు. ఈ నేపథ్యంలో యూట్యూబర్లు, అభిషేక్ మల్హన్, ఎల్విష్ యాదవ్, లక్షయ్ చౌదరి, పురవ్ ఝాతోపాటు భారతీ సింగ్‌కు సమన్లు జారీ చేశామన్నారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని వాంగ్మూలం ఇవ్వాలని వారికి జారీ చేసిన సమన్లలో స్పష్టం చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు.

# ఈషా ఫౌండేషన్‌పై హైకోర్టుకు నివేదిక

**కోయంబత్తూరు :** ఈషా ఫౌండేషన్.. ఆధ్యాత్మిక భావాలు ఉన్న హిందువే కాదు. వివిధ మతాలవారు, విదేశీయులకు కూడా ఈ ఫౌండేషన్ గురించి తెలుసు. తమిళనాడులోని ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగాతోపాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈషా ఫౌండేషన్ 1992లో ప్రారంభమైంది. ఎలాంటి లాభాపేక్ష లేని ఆధ్యాత్మిక సంస్థ. తమిళనాడులోని కోయంబత్తూరు సమీపంలో సద్గురు(జగదీష్ వాసుదేవ్) దీనిని స్థాపించారు. ఈషా యోగా కేంద్రాన్ని, ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్వహిస్తుంది. పూర్తిగా వలంటీర్లే దీనిని నిర్వహిస్తున్నారు. నీలగిరి పర్వతాలలో భాగమైన వెల్లియంగిరి శ్రేణిలో 150 ఎకరాల స్థలంలో దట్టమైన అడవులు, ప్రత్యేకమైన వన్యప్రాణుల అభయారణ్యంతో ఉంది. ఇది ప్రఖ్యాత శక్తి కేంద్రం భక్తి, జ్ఞానోదయం, కర్మ, క్రియ వంటి యోగా అన్ని విభాగాలను ఒకే గొడుగు క్రింద అందించడం, గురు?శిష్య సంప్రదాయాన్ని పునరుద్ధరించడం ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి ప్రజలను ఆకర్షిస్తుంది.ఇదిలా ఉంటే.. ఈషా ఫౌండేన్‌లో అన్నింటికీ ఫీజే. నిస్వార్థ సేవ అని సంస్థ చెబుతన్నా.. ఉచితంగా ఇక్కడ ఎలాంటి సేవలు పొందలేరు. ప్రతీ సేవకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందుకు డబ్బులు చెల్లించాలి. సెలబ్రిటీలను ఫౌండేషన్‌కు తీసుకువచ్చి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారం పొందుతోంది. తద్వారా ప్రతీదానికి డబ్బులు వసూలు చేస్తోంది. సినిమా నటులు, క్రీడాకారులు, విదేశీయులు ఇలా వేర్వేరు రంగాలకు చెందిన వారు ఫౌండేషన్‌ను సందర్శించిన ఫొటోలు, అక్కడ వారు మాట్లాడిన మాటలను ఈషా వెబ్‌సైట్‌లో ఉంచడం ద్వారా కొత్తవారిని ఆకట్టుకుంటోంది. శివరాత్రికి నిర్వహించే జాగరణ కార్యక్రమానికి పెద్దపెద్ద




సెలబ్రిటీలను పిలిచి దానిని కూడా ప్రచారానికి వాడుకుంటున్నారు.ఇక సద్గురు జగదీష్ వాసుదేవ్ పాదాల ఫొటోలను కూడా ఈషా ఫౌండేషన్ విక్రయిస్తోంది. ఒక ఫొటో ఖరీదు రూ.3,200గా ఉంది. ఈమేకు ఈ ఫొటో దాని ధర వివరాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈషా ఫౌండేషన్ ఆన్‌లైన్ షాప్‌లో కూడా ఈ ఫొటో ఉంది. దీనిపై చాలా మంది వివిధ రకాల కామెంట్స్ చేస్తున్నారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన సద్గురు పాదాలను విక్రయిస్తూ 'గురువు పాదాలకు నమస్కరించడం అనేది మంచిది. గురువుతో లోతైన బంధాన్ని ఏర్పరుస్తుంది' అని ఈషా ఆన్‌లైన్ షాప్‌లో రాశారు. అయితే దీనిపై కొందరు విమర్శలు చేస్తున్నారు. మరికొందరు నవ్వుకుంటున్నారు. ఇదిలా ఉంటే కోయంబత్తూర్‌లోని తొండముత్తూర్‌లోని ఈషా ఫౌండేషన్ ఆశ్రమంలో 150 మంది పోలీసులు తనిఖీలు చేశారు. ఇద్దరు యువతులను నిర్బంధించారనే ఆరోపణలపై కోర్టు ఆదేశాలమేరకు పోలీసులు తనిఖీలు చేశారు. మరోవైపు ఈషా ఫౌండేషన్‌పై నమోదైన కేసులపై హైకోర్టు నివేదిక కోరింది.

# దీపావళికి మేకిన్ ఇండియా

**న్యూఢిల్లీ :** బతుకమ్మ మొదలైంది. ఈ ప్రకారం పండుగల సీజన్ ప్రారంభమైనట్టే. ఈ నవరాత్రి వేడుకలను దేశవ్యాప్తంగా జరుపుకుంటారు. ఒక్కో ప్రాంతంలో తక్కువ తీరుగా నిర్వహిస్తుంటారు. దసరా, దీపావళి, చాట్ పూజలతో భారతదేశం మొత్తం పండగ వాతావరణం నెలకొంటుంది. అయితే ఈ పండగలవేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలకమైన వ్యాఖ్యలు చేశారు. మనం నిర్వహించుకునే పండుగలకు.. మనం తయారు చేసే వస్తువులను మాత్రమే వాడాలని దేశ ప్రజలకు పిలుపుని చ్చారు. అయితే మోడీ చేసిన వ్యాఖ్యలను జాగ్రత్తగా పరిశీలి స్తే.. అవి చైనాకు చెక్ పెట్టేలాగా ఉన్నాయని తెలుస్తోంది.. త్వరలో జరుపుకోబోయే దీపావళి పండుగను మేడ్ ఇన్ ఇండియా వస్తువులతోనే నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇటీవల గణేష్ నవరాత్రి ఉత్సవాలలోనూ దేశీయంగా తయారైన వస్తువులనే మెజారిటీ ప్రజలు వాడారు. దీంతో చైనా నుంచి దిగుమతి అయ్యే వివిధ రకాల వస్తువులు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. దాన్ని మర్చిపోకముందే నరేంద్ర మోడీ దీపావళి పండుగకు సంబంధించి ఉపయోగించే ప్రమిదల నుంచి మిఠాయిల వరకు స్థానికంగా తయారైనవి మాత్రమే వినియోగించాలని సూచించారు. వాస్తవానికి మనదేశంలో పండగల సమయంలో చైనా దేశం నుంచి విచ్చలవిడిగా వస్తువులు మార్కెట్లో దర్శనమిస్తాయి. ఆ వస్తువులు అత్యంత తక్కువ ధరలో లభిస్తాయి. వాటి వల్ల స్థానికంగా ఉన్న తయారీదారులకు ఉపాధి కరవుతుంది.. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా మేడిన్ ఇండియాకు, మేక్ ఇన్ ఇండియాకు భారత ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.



ఇందులో భాగంగా చైనా వస్తువులపై అనధికార నిషేధం విధించింది. లోకల్ మేడ్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రారంభించింది. నేరుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్థానికంగా ఉన్న ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని పిలుపునివ్వడం మొదలుపెట్టారు. వోకల్ ఫర్ లోకల్ అనే నినాదాన్ని ఆయన తెరపైకి తీసుకొచ్చారు.ఇక గత ఏడాది లాగానే ఈ ఏడాది కూడా మేకింగ్ ఇండియా ఉత్పత్తులను వాడాలని మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. గత కొంతకాలంగా భారత్ ? చైనా మధ్య వాణిజ్య ఒప్పందాలు అనేక సంక్లిష్టతల మధ్య సాగుతున్నాయి. ఈ క్రమంలో పండుగ సమయంలో మన దేశంలో తయారైన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని నరేంద్ర మోడీ పిలుపునిస్తున్నారు. ఫలితంగా స్థానికంగా ఉత్పత్తుల తయారీ పెరిగింది. వ్యాపారులకు లాభాలు వస్తున్నాయి . ఈ సంవత్సరం రక్షాబంధన్ పండుగ సమయంలో స్థానికంగా తయారైన రాఖీలను మాత్రమే ప్రజలు కొనుగోలు చేశారని ది కాన్ఫిడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రకటించింది. చాలా సంవత్సరాలుగా మనదేశంలో తయారైన రాఖీలు మాత్రమే అమ్ముడవుతు న్నాయని వారు పేర్కొన్నారు. దీనివల్ల చైనా నుంచి దిగుమతి అయిన రాఖీలకు ప్రతిగా డిమాండ్ లేదని ఆ సంస్థ ప్రకటించింది. గత ఏడాది దీపాలు సమయంలో స్థానికంగా తయారైన దీపాలకు డిమాండ్ పెరిగిందని.. గత కొంతకాలంగా మార్కెట్లో గట్టి పోటీ ఇస్తున్న చైనా కంపెనీలకు.. భారత కంపెనీల ఉత్పత్తులు గట్టి పోటీనిస్తున్నాయని వారు వివరించారు.. తక్కువ ధర వల్ల చైనా ఉత్పత్తులు ప్రజల ఆదరణ పొందినప్పటికీ.. అవి నాణ్యంగా లేకపోవడంతో తిరిగి ప్రజలు దేశీయ ఉత్పత్తులను ఆదరించడం మొదలు పెడుతున్నారని వ్యాపారులు అంటున్నారు. పైపులైట్ స్ట్రింగ్స్, బ్యాటరీ తో నడిచే దయాలైట్, ఎల్ఈడి లైట్.. ఫ్లవర్ లైట్.. గోల్డెన్ లైట్ వంటి వస్తువులను భారతీయ కంపెనీలు విరివిగా తయారుచేస్తున్నాయి. వాటిని మన దేశ ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. ఇదే సమయంలో చైనా కంపెనీలు కూడా అలాంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నప్పటికీ.. ప్రజలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించడం లేదని వ్యాపారులు అంటున్నారు.

# ఆ ముగ్గురు మంత్రుల భేటీ వెనుక ఉన్న మతలబు ఏమిటో...

బెంగళూరు: ముడా వివాదంలో సీఎం సిద్దరామయ్యకు కేసుల కష్టాలు బిగుసుకుంటున్న తరుణంలో మంత్రుల రహస్యభేటీ కాంగ్రెస్?లో కలకలం రేపుతోంది. కారణాలు ఏవైనా రహస్యంగా సమావేశం కావడం పలువురు మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను విస్మయం కలిగిస్తోంది. బీజేపీ-జేడీఎస్ నాయకులు ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ పార్టీకి తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నా వాటి గురించి ఒకరిద్దరు తప్ప మంత్రులెవరూ నోరు మెదపడం లేదు. మరోవైపు రహస్య సమావేశాల వెనుక భారీ అజెండానే ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా మంగళవారం రాత్రి హోం మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప, ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహొళిలు భేటీ అయ్యారు. వీరు ప్రస్తుతం కేబినెట్‌లో కీలకమైన మంత్రులు. ఇప్పటికే పరమేశ్వర్ తాను సీఎం రేసులో ఉన్నానని దాదాపు నిరూపించుకున్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీతో ప్రత్యేక సమావేశం కావడం, సదరు విషయాలను బహిరంగంగా చెప్పలేనంటూ ప్రకటించారు. మరోవైపు సతీశ్‌జార్కిహొళి ఆగస్టు రెండోవారం తర్వాత నుంచి సెప్టెంబరు రెండోవారం దాకా నాలుగైదుసార్లు ఢిల్లీకి వెళ్లొచ్చారు. ప్రతిసారి పరమేశ్వర్‌తో చర్చలు జరిపాకనే జార్కిహొళి ఢిల్లీ వెళ్లి వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల హోం మంత్రి పరమేశ్వర్, డీసీఎం డీకే శివకుమార్‌లు ప్రత్యేకంగా భేటీ అయిన విషయం మరువకముందే ముగ్గురు మంత్రుల కలయిక కాంగ్రెసలో కుతూహలం రేకెత్తిస్తోంది. దళిత ముఖ్యమంత్రి అంశం అప్పుడప్పుడు తెరపైకి వస్తున్న విషయం తెలిసిందే. మంత్రి మహదేవప్ప ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అత్యంత ఆప్తుడనే విషయం తెలిసిందే. సిద్దరామయ్యను వీడి మహదేవప్ప రాజకీయం చేసే ఆలోచన లేదనేది ఇప్పటివరకు సాగింది. అయితే సీఎం సిద్దరామయ్యపై లోకాయుక్త విచారణకు ముందే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది. లోకాయుక్త కంటే ముందే సిద్దరామయ్యను ఈడీ విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆదివారం ముడా వివాదంలో ఫిర్యాదుదారుడు స్నేహమయికృష్ణకు ఈడీ నోటీసులు ఇచ్చింది.

## హెచ్‌సీఏలో 20 కోట్ల ఫ్రాడ్..



**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ సంఘంతో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు ఇవాళ ఈడీ నోటీసులు జారీ చేసింది. 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఆ సమయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ పనిచేశారు. క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఆర్ నమోదు చేసింది ఈడి. ఈ విషయం ఇప్పటికే అజారుద్దీన్ బెయిల్ పొందారు. అయితే తాజాగా విచారణ చేపట్టాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ, ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన అజారుద్దీన్.. గురువారం ఈడీ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీఏలో 20 కోట్ల మోసం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఈడీ విచారణ చేపడుతున్నది. ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌లను గత డిసెంబర్‌లో విచారించారు. హెచ్‌సీఏ కేసులో మాజీ మంత్రి, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జీ వినోద్‌ను కూడా ఈడీ ప్రశ్నించింది. గత ఏడాది నవంబర్‌లో వినోద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ ఇండ్లల్లో ఈడీ సోదాలు కూడా చేపట్టింది. మనీల్యాండరింగ్ చట్టం కింద 9 ప్రదేశాల్లో తనిఖీలు జరిగాయి. ఏసీబీ నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ విచారణ మొదలుపెట్టింది. ఉప్పల్ స్టేడియం కోసం డీజీ సెట్లు, ఫైర్‌ఫైటింగ్ సిస్టమ్స్, కెనోపీల ఖరీదులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో అజారుద్దీన్‌పై నాలుగు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. సుమారు 3.85 కోట్ల నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసులు బుక్ చేశారు. చీటింగ్, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర కింద అజార్‌పై కేసులు పెట్టారు. హెచ్‌సీఏకు చెందిన నాలుగు కేసుల్లోనూ గతంలో సిటీ కోర్టు అజార్‌కు బెయిల్ మంజూరీ చేసింది. 2019లో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ ఎన్నికయ్యారు. ఆయన 2023 ఫిబ్రవరి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

## ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ తెరిచి.. లక్షల్లో మోసం



**రాయ్‌పూర్:** మరో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఏకంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కొందరు వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగులుగా నియమించారు. ఆ బ్రాంచ్‌లో బ్యాంకు కార్యకలాపాలు కూడా ప్రారంభించారు. గ్రామస్తుల నుంచి డబ్బులు జమ చేసుకున్నారు. సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం అందడంతో ఈ మోసం బయటపడింది. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు భారీ బ్యాంకింగ్ మోసాన్ని పక్కాగా ప్లాన్ చేసి అమలు చేశారు. మారుమూల ప్రాంతమైన ఛపోరా గ్రామంలో ఏకంగా ఎస్‌బీఐ పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కాంప్లెక్స్‌లోని షాపును అద్దెకు తీసుకున్నారు. నిజమైన బ్యాంకుగా నమ్మించేందుకు ఫర్నీచర్‌తోపాటు క్యాష్ కౌంటర్ వంటివి ఏర్పాటు చేశారు. కాగా, బ్యాంకు ఉద్యోగాల పేరుతో రెండు నుంచి ఆరు లక్షల వరకు మహిళలతో సహా ఆరుగురు వ్యక్తుల నుంచి డబ్బులు దండుకున్నారు. వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇవ్వడంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు. బయోమెట్రిక్ హాజరుతో వారు బ్యాంకు విధులకు హాజరయ్యారు. ఎస్‌బీఐ కొత్త బ్రాంచ్ ఏర్పాటు పట్ల గ్రామస్తులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. లావాదేవీల కోసం ఆ బ్రాంచ్‌కు వెళ్లారు. అయితే సుమారు పది రోజుల పాటు పని చేసిన ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ గురించి సమీపంలోని దబ్రా బ్రాంచ్ మేనేజర్ దృష్టికి వచ్చింది. ఈ బ్రాంచ్ పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సెప్టెంబర్ 27న ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు కలిసి అక్కడకు వెళ్లారు. అచ్చం ఎస్‌బీఐ బ్రాంచ్ మాదిరిగా కనిపించడంతోపాటు బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తున్న నకిలీ బ్రాంచ్‌ను చూసి వారు కంగుతిన్నారు. మరోవైపు నకిలీ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ నకిలీ బ్రాంచ్‌కు మేనేజర్‌గా వ్యవహరించిన పంకజ్‌తోపాటు రేఖా సాహు, మందిర్ దాస్‌తో సహా నలుగురు ఈ స్కామ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మోసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు డబ్బులు పోగొట్టుకోగా, నిజంగా బ్యాంకు ఉద్యోగమని నమ్మి నియామక పత్రాలు పొందిన వారు కూడా చిక్కుల్లో పడ్డారు.

## జైలు ఖైదీల్లో కులవివక్ష సరికాదు



**న్యూఢిల్లీ:** జైలు మాన్యువల్స్‌లో క్యాస్ట్ కాలమ్‌ను తొలగించాలని కేంద్రం, రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. చిన్న కులాల ఖైదీలతో మరుగుదొడ్లు కడిగించడం వంటి స్కావెంజింగ్ పనులు, అగ్ర కులాల వారికి వంట పనుల కేటాయింపు వివక్షే అవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. జైళ్లలో కుల ఆధారిత వివక్ష, విభజన ఉందని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారించిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి చర్యలు అంటరానితనం కిందకే వస్తాయని పేర్కొంది. కులం ఆధారంగా ఖైదీలను వేరుగా ఉంచడం మార్పు తీసుకురాదని, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించడం వలసవాద వ్యవస్థకు చిహ్నామని వెల్లడించింది.

**ఆర్టికల్ 15 ఉల్లంఘనే..**

"కొన్ని రాష్ట్రాల్లో కులం ఆధారంగా ఖైదీలకు పనులను అప్పగిస్తున్నారు. జైలులో గదుల కేటాయింపునకు సంబంధించిన నిబంధనలు సరికావు. షెడ్యూల్డ్ కులాల ఖైదీలకే క్లీనింగ్ పనులు అప్పగించడం విస్మయం కలిగిస్తోంది. కింది కులాల ఖైదీలకు మాత్రమే శుభ్రపరిచే పని, అగ్రవర్ణ ఖైదీలకు వంట పనులు ఇవ్వడం ఆర్టికల్ 15ను ఉల్లంఘించడమే. అభ్యంతరకరంగా ఉన్న నిబంధనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మూడు నెలల్లో మార్చాలి. ఈ నిర్ణయం అమలుకు సంబంధించిన నివేదికను కూడా కోర్టులో సమర్పించాలి" అని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఖైదీలపై వివక్షకు కులం కారణం కారాదని, అలాంటి వాటిని అనుమతించేది లేదని తెలిపింది. పని విషయంలో అందరికీ సమాన హక్కు కల్పించాలని వివరించింది. ప్రమాదకరంగా ఉన్న మురుగునీటి ట్యాంకులను శుభ్రం చేసే పనులకు ఖైదీలను అనుమతించకూడదని సూచించింది. ఒక కులం వారినే స్వీపర్లుగా ఎంపిక చేయటం సమానత్వ హక్కుకు వ్యతిరేకమని వివరించింది.

# కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో చేసింది తప్పులు.. అప్పులే..



-మొదటిపేజీ తరువాయి

ధ్వజమెత్తారు.

**హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఏం చేశారు**

అందుకే ప్రజలు కేసీఆర్ ఉద్యోగం ఊడగొట్టారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నియామకాలు చేపట్టామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడాలన్న ఉద్దేశంతోనే హైడ్రా, మూసీ ప్రాజెక్టులను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కిరాయి మనుషులతో బీఆర్ఎస్ నేతలు చేసే హడావుడి తెలంగాణ సమాజం గమనిస్తోందని చెప్పారు. పదేళ్లు బీఆర్ఎస్ నేతలు దోచుకున్న సొమ్ము వాళ్ల పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు మూలుగుతున్నాయని. విమర్శించారు. అందులోంచి రూ.500 కోట్లు మూసీ ప్రాంత పేదలకు పంచి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ప్రత్యామ్నాయం ఏం చేయాలో చెప్పాలని అన్నారు. ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉందని అన్నారు. హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**వారి ఫామ్‌హౌస్‌లను కాపాడుకుంటున్నారు..**

"మూసీ మురుగులో బతుకుతున్న పేదలకు ఇళ్లు, రూ.25 వేలు ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని పెంచుతున్నాం. బీఆర్ఎస్ నేతల ఫాంహౌస్‌లను కాపాడుకోవడానికే పేదల ముసుగు అడ్డం పెట్టుకుంటున్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అక్రమంగా నిర్మించిన ఫాంహౌస్‌లు కూల్చాలా వద్దా? మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కొడుకులకు ఫామ్ హౌస్‌లు ఉన్నాయి. వాటిని కూలగొట్టాలా వద్దా..? ఫాంహౌస్‌లు కూలుతాయనే పేదలను అడ్డు పెట్టుకుంటున్నారు. నల్లచెరువులో, మూసీనది ఒడ్డున ప్లాట్లు చేసి అమ్మింది బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాదా..? 20ఏళ్లు ప్రజల్లో తిరిగినవాన్ని నాకు పేద ప్రజల కష్టాలు తెలియదా? మూసీని అడ్డు పెట్టుకుని ఎంతకాలం తప్పించుకుంటారు..? జవహర్ నగర్‌లో 1000 ఎకరాలు ఉంది... రండి పేదలకు పంచి ఇందిరమ్మ ఇళ్లు కట్టిద్దాం. ఇక్కడి ఎంపీ ఈటల రాజేందర్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దగ్గర నుంచి ఏం తీసుకువస్తారో చెప్పాలి. సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయొచ్చు కానీ.. మూసీని అభివృద్ధి చేయొద్దా ఈటలా? కేటీఆర్, హరీశ్‌రావులు మాట్లాడిన జిరాక్స్ కాపీ తీసుకుని ఈటల మాట్లాడుతున్నారు. పార్టీ మారినా ఈటలకు పాత వాసనలు పోలేదు. మూసీ పరివాహక ప్రాంతాల పేదలకు ఇళ్లు తీసుకురావడానికి మోదీ దగ్గరకు వెళ్దాం రండి... నాకు రావడానికి ఎలాంటి భేషజాలు లేవు.. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రావాలి. నగరంలో చెరువులు, ఆక్రమణల లెక్క తీద్దాం రండి... వందలాది గొలుసుకట్టు చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వరదలు వచ్చి లక్షలాది కుటుంబాలు ఆగమవుతున్నాయి.." అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

**భాగ్యనగరానికి మంచిభవిష్యత్‌ను అందిస్తాం..**

"ఇప్పటికే చెరువులు, నాళాలు మూసుకుపోయాయి.. ఇలాగే చూస్తే.. ఇంకొన్నాళ్లకు మూసీ కూడా మూసుకుపోతుంది.. రాజకీయాల్లో నాకు లోతు తెలియక కాదు.. భాగ్యనగరానికి మంచిభవిష్యత్‌ను అందించేందుకే మా చర్యలు.. పేదల దుఃఖం నాకు తెలుసు.. పేదవాడి కన్నీళ్లు చూడాలని మేం కోరుకోవడంలేదు. ప్రతీ పేదవాడికి ప్రత్యామ్నాయం చూపించడమే మా ప్రభుత్వ ఉద్దేశం.. చెరువులు, నాళాలు, మూసీ ఆక్రమణలు తొలగించాల్సిందే... పేదలకు ఎలా న్యాయం చేద్దామో మీరు చెప్పండి... మీ పదేళ్ల పాలన దోపిడీకే పనికి వస్తుందా...? పదేళ్లు పాలించామని, అనుభవం ఉందని చెబుతున్న వారు పేదలకు ఏం చేద్దామో చెప్పాలి. మొత్తం మంత్రివర్గాన్ని తీసుకువస్తా.. మోదీ వద్దకు తీసుకెళ్లి ఈటల రాజేందర్ రూ.25వేల కోట్లు నిధులు ఇప్పించగలరా... ఇళ్లు లేని పేదలకు ఇళ్లు ఇవ్వడం నేరమా? విషాన్ని దిగమింగుతున్న నల్లగొండ ప్రజలను కాపాడాలని అనుకోవడం తప్పా. మీకు ఓటు వేయనందుకు నల్లగొండ ప్రజలను చంపేయాలని చూస్తారా? మీలాంటి వారి కోసం బుల్డోజర్లు అవసరం లేదు. రాజకీయాల కోసం మూసీ ప్రాజెక్టు చేపట్టలేదు.. హైదరాబాద్ భవిష్యత్ కోసమే మేం ఈ ప్రాజెక్టు చేపడుతున్నాం. సంచులు తీసుకున్నవారికే సంచుల గురించి తెలుస్తుంది.. ఇళ్లు తొలగిస్తే ఎవరైనా సంచులు ఇస్తారా? తిట్లు తప్పా. దోపిడీ సొమ్ముతో కేటీఆర్ అడ్డగోలు పనులు చేస్తే ప్రజలు క్షమించరు" అని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.

**బావ, బామర్దుల అక్రమాలు బయటకు తీస్తాం**

బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు సీఎం రేవంత్‌రెడ్డి. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్న కారు పార్టీ నేతల బాగోతాలను బయటపెట్టారు. జన్వాడ, అజీజ్‌నగర్ ఫామ్‌హౌస్‌లు అక్రమ నిర్మాణాలు కాదా అంటూ ప్రశ్నించారు. సబితా ఇంద్రారెడ్డి ఆస్తుల గురించి అందరికీ తెలుసని, ఎంపీ ఈటెల రాజేందర్‌కు పాత పార్టీ వాసన పోలేదన్నారు.మూసీ ప్రక్షాళనను బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడాన్ని తూర్పారబట్టారు సీఎం రేవంత్ రెడ్డి. మూసీ అభివృద్ధి విషయంలో అవసరమైతే అఖిలపక్షం ఏర్పాటు చేస్తామని మీరు రావాలని అన్నారు. చెరువు భూములను ప్లాట్లు చేసి అమ్ముకున్నది బీఆర్ఎస్ పార్టీ కాదా అంటూ ప్రశ్నించారు. ఆక్రమణలు తొలగిస్తే సంచులు ఎలా వస్తాయని, తీసుకున్నవారికే వాటి గురించి తెలియాలని కేటీఆర్‌కు చురకలు అంటించారు. సికింద్రాబాద్ సిక్ విలేజీ ప్రాంతంలోని హాకీ మైదానంలో కుటుంబ గుర్తింపు, డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, పేదలకు అన్యాయం జరిగిందంటూ బీఆర్ఎస్ నేతలు ఏడుస్తున్నారని అన్నారు.రాష్ట్రాన్ని దోచుకున్న నిధులు బీఆర్ఎస్ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయని, అందులో రూ.500 కోట్లు మూసీలో ముంపునకు గురైనవారికి పంచిపెట్టాలన్నారు. హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఆరోజు సూచనలు ఎందుకు చేయలేదని సూటిగా ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబిత కుమారుల ఫామ్‌హౌజ్‌లు కూల్చాలా వద్దా? మీరే చెప్పాలంటూ ప్రజలను ప్రశ్నించారు.మూసీ నదిని అడ్డుపెట్టుకుని ఫామ్‌హౌజ్‌లు కాపాడుకోవాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు ముఖ్యమంత్రి. హైదరాబాద్‌ను ఎలా కాపాడుకోవాలో ఆలోచించకుండానే పనులు చేస్తున్నామా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు తప్పించుకున్నా ఏదో ఒకరోజు మీ భరతం పడతామన్నారు. మూసీ పేదలకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలా? వద్దా? అనేది ప్రతిపక్షాలు చెప్పాలని వ్యాఖ్యానించారు.సోషల్ మీడియాలో కిరాయి మనుషులతో బావాబామ్మర్దులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు హడావిడి చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పదేళ్లు రాష్ట్రానికి దోచుకున్న బీఆర్ఎస్ నేతలు, ఫామ్‌హౌజ్‌లు కాపాడుకోవడానికే హైడ్రాకు, మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నారని దుయ్యబట్టారు. మూసీ ఒడ్డున జీవచ్ఛవంలా బతుకుతున్నవారిని ఆదుకుంటుంటే.. అడ్డుపడతారా? అని దుయ్యబట్టారు.

# బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయి



**మెదక్ :** బీఆర్ఎస్, బీజేపీలపై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. కవిత కోసం బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఒప్పందాలు జరిగాయని.. అందుకే ఆమె బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. గురువారం నాడు గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన మంత్రి కొండా సురేఖ.. బీఆర్ఎస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు.

**కొండా సురేఖ కామెంట్స్..**

'గజ్వేల్ ప్రజలు అనుకుంటే ఏదైనా సాధిస్తారని నమ్మకం ఉంది. మెదక్ ఎంపీ అభ్యర్థిగా బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్.. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకుంది. ఎంపీలుగా బీజేపీని గెలిపిస్తామని, కవితని వదిలిపెట్టాలని ముందే అమిత్ షాతో ఒప్పందం చేసుకున్నారు. ప్రజలకు ఏ విధంగా సేవ చేయాలా అని మేము చూస్తుంటే.. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, రాతలు రాపిస్తూ కేటీఆర్ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షం ఇంతవరకు నియోజకవర్గం లో కానీ, అసెంబ్లీలో కానీ అడుగుపెట్టలేదు. గజ్వేల్ ఎమ్మెల్యే ఉన్నాడా లేడా అనేది ప్రశ్నగా ఉంది. కేసీఆర్ కనపడట్లేదు అని పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇవ్వాలి. కేసీఆర్‌ను పక్కన పెట్టి.. ప్రజా సొమ్మును దోచుకొని.. ప్రజలలో బీఆర్ఎస్‌పై నమ్మకం పోయేలా చేసింది కేటీఆర్. మొన్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణం కేటీఆర్. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలి కానీ అడ్డుపడితే ఊరుకునేది లేదు.' అని అంటూ విపక్షాలకు మాస్ వార్నింగ్ ఇచ్చారు మంత్రి.

**హామీలన్నీ అమలు చేస్తాం..: తుమ్మల**

తల తాకట్టు పెట్టి అయినా రైతాంగానికి అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. త్వరలోనే రూ. 2 లక్షల రుణ మాఫీనీ పూర్తిచేస్తామని రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు రైతు రుణమాఫీపై మాట కూడా మాట్లాడలేదు. దేశంలో ఏ రైతు పండించని పంటలు మన రైతులు పండిస్తున్నారు. ప్రతి గింజను మార్కెట్ ధర కంటే ఎక్కువకు ప్రభుత్వమే కొని రైతులను ఆదుకుంటాం. రైతును దగా చేసిన వాళ్ల మాటలు నమ్మవద్దు. మేము ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిగా అమలు చేస్తాం. సంవత్సరం లోపు రూ. 300 కోట్లతో జిల్లాలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తాం. పామ్ ఆయిలో రాష్ట్రంలో, దేశంలోనే సిద్దిపేట జిల్లా మొదటిస్థానంలో ఉండాలి. ఇతర దేశాల నుండి లక్ష కోట్లు పెట్టి ఆయిల్ కొంటున్నాము. ఇప్పటికే 11 వేల ఎకరాలు సాగు అవుతుంది. ఇంకా 11 వేల ఎకరాలకు పెంచాలి. భారత దేశానికి కావలసిన ఆయిల్ మొత్తం తెలంగాణ ఇస్తుందని రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి చెప్పారు.' అని మంత్రి తుమ్మల చెప్పుకొచ్చారు.

**రైతాంగానికి అండగా కాంగ్రెస్ సర్కార్: పొన్నం ప్రభాకర్**

'రైతాంగానికి ఎక్కడ ఇబ్బంది వచ్చినా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు 1వ తేది నుండి అందుబాటులోకి వస్తాయి. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అనేక అబద్ధపు హామీలు ఇచ్చారు. నాటి ప్రభుత్వంలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా రాచరికపు నిర్ణయాలు తీసుకున్నారు. శాసన సభ్యుని హోదాలో ఇంత వరకు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. బీజేపీ, బీఆర్ఎస్ రైతు వ్యతిరేఖ చట్టాలు తీసుకువచ్చాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు రైతాంగం అండగా ఉంది. గత ప్రభుత్వం రైతాంగానికి ఇవ్వవలసిన పనిముట్లను వాళ్ళ కార్యకర్తలకు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ విధంగా కాకుండా చిన్న, సన్నకారు రైతులకే వ్యవసాయ పనిముట్లు అందజేస్తాం.' అని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు భరోసా ఇచ్చారు.


# రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు



-మొదటిపేజీ తరువాయి

చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ డిజిటల్ కార్డుల ద్వారానే రేషన్ కార్డు ,హెల్త్ కార్డు , పింఛను , ప్రభుత్వ పథకాలన్నీ ప్రామాణికం కానున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ లో ప్రారంభించారని తెలిపారు.రాష్ట్రం మొత్తం 119 నియోజకవర్గాల్లో 288 చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభం అయిందని,ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం కోసం ఒక గ్రామం , మున్సిపాలిటీ లో ఒక వార్డ్ పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేశారన్నారు. ఎంత మంది పౌరులున్న కుటుంబం పరంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పం తీసుకుందని తెలిపారు. ఇందులో కుటుంబ ఆస్తుల వివరాలు ఆర్థిక లావాదేవీలు అడగరన్నారు. కుటుంబ సభ్యుల సంఖ్య ఒక గ్రూప్ ఫోటో లాంటి వివరాలు మాత్రమే అడుగుతారని తెలిపారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఇంట్లో నలుగురు పిల్లలు ఉండి పెళ్ళిళ్ళు అయి వారికి పిల్లలున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తారని,ఈ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు ఎక్కడైనా తీసుకోవచ్చు అని తెలిపారు. డిజిటల్ గుర్తింపు కార్డు ఫ్యామిలీ పెద్దగా మహిళా పేరు మీదనే వస్తుందన్నారు. గుర్తింపు కార్డు ద్వారానే ఇందిరమ్మ ఇళ్లు ,పింఛన్లు ప్రభుత్వ పథకాలు అన్ని డిజిటల్ కార్డు ద్వారానే వస్తాయని అన్నారు.కర్ణాటక హర్యానా లాంటి ప్రాంతాల్లో ఇప్పటికే ఈ డిజిటల్ కార్డులను అమలు చేస్తున్నారన్నారు.ఇప్పటికే అక్కడ మా అధికారులు అక్కడ పరిశీలించి అధ్యయనం చేశారని తెలిపారు.ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసింది ఇప్పటికే లక్షా ,లక్షా 50 వేలు ,2 లక్షల లోపు ఉన్న వారికి రుణమాఫీ పూర్తైందన్నారు.2 లక్షల పైన ఉన్న వారికి 2 లక్షల వరకు దసరా లోపు మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారన్నారు.గత ప్రభుత్వం లో లక్ష రూపాయల రుణమాఫీ నాలుగు విడతలుగా చేశారు..మేము ఒకేసారి పూర్తి చేశామన్నారు. అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలన్నారు.ఈ పైలెట్ ప్రాజెక్ట్ కార్యక్రమం లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావా లన్నారు. ఈ.కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్డీవో , ఎంపిడివో ,ఇతర అధికారులు,కరీంనగర్ నియోజకవర్గ ఇన్చార్జి పురుమల్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

## మార్పు మార్పు అంటూ కాంగ్రెస్ మోసం చేసింది



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం అమలుకు నోచుకోలేదు. రేవంత్ సర్కార్ పరిపాలన ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్నచందంగా తయారైంది. పరిపాలన అస్తవ్యస్తంగా మారడంతో పెట్టుబడులు ఆగిపోయాయి. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోయాయి. ఆదాయం కూడా పూర్తిగా పడిపోయింది. ఇక రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలన వైఫల్యానికి నిదర్శనం.. అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి.. సీఎం రేవంత్ రెడ్డికి లేకపోవడంతో అసలు సమస్య ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఈ దుస్థితి ఉంటే.. వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప.. దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం.. మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ దుయ్యబట్టారు.

## ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారు



**హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. అందరికంటే ముందే సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన ముఖ్యమంత్రి... అమలు చేయడంలో మాత్రం ఎందుకు శ్రద్ధ చూపించడం లేదో అర్థం కావడం లేదన్నారు. సుప్రీం కోర్టు ఆగస్ట్ 1వ తేదీన ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పునకు సీఎం రేవంత్ రెడ్డి విరుద్ధంగా వ్యవరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు చెప్పిందని తెలిపారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారని.. ... అందరికన్నా ముందు తీర్పును స్వాగతించారని గుర్తుచేశారు. డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారని .. 9 వ తేదీన నియామక పత్రాలు ఇస్తామన్నారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన తర్వాత డీఎస్సీ పరీక్షలు జరిగాయని చెప్పారు. డీఎస్సీ ఫలితాలు ప్రకటించారని.. వర్గీకరణ విసయంలో ఎందుకు నిర్లక్ష్యం చేరిస్తున్నారని ప్రశ్నించారు. చట్ట సభలో ఇచ్చిన మాటకి విరుద్ధంగా చేస్తున్నారని మండిపడ్డారు.

సుప్రీం తీర్పు అనంతరం పంజాబ్ , తమిళనాడు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కమిటీ వేసి అనంతరం అమలు చేస్తామని రేవంత్ చెప్పారని .. ఇప్పటి వరకు ఈ విషయంపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధిష్ఠానం ఒత్తిడి ఒకవైపు , ఇంకోవైపు రాష్ట్రంలో మాలల ఒత్తిడి వల్ల వర్గీకరణ అమల్లో వెనుకాడరని అన్నారు. 9 వ తేదీన నల్ల జెండాలతో అన్ని జిల్లాలో నిరసన తెలపాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కమిటీ వేసి అనంతరం అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఈ విషయంపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని నిలదీశారు. అధిష్ఠానం ఒత్తిడి ఒకవైపు , ఇంకోవైపు రాష్ట్రంలో మాలల ఒత్తిడి వల్ల వర్గీకరణ అమలుకు వెనుకాడుతున్నారని ఆరోపించారు. జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 9న అన్ని జిల్లాల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతామన్నారు.

## ఎమ్మెల్యే అనర్హత వేటు.. స్టే ఇచ్చేందుకు నిరాకరణ

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా అసెంబ్లీ సెక్రటరీకి, స్పీకర్‌కు సూచనలు చేసింది. నెల రోజుల్లో నిర్ణయం తీసుకొని షెడ్యూల్‌ను బెంచ్ ముందు ఉంచాలని ఆదేశించింది. లేకుంటే సుమోటోగా తామే ఓ నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. ఇప్పటికిప్పుడు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం కుదరని చెప్పేసింది. తదుపరి వాదనలు 24న వింటామని పేర్కొంది. హైకోర్టులో ఏప్రిల్‌లో పిటిషన్ వేసే నాటికి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు పార్టీ మారారు. వాళ్లపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలంటూ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్లు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఆగస్టు 7న వాదనలు పూర్తి అయ్యాయి. తర్వాత తీర్పును హైకోర్టు సింగిల్ బెంచ్ రిజ్వర్ చేసింది. సెప్టెంబర్ 9న సోమవారంనాడు తీర్పు వెలువరించింది. ఏప్రిల్ తర్వాత మరికొందరు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలా వెళ్లి వచ్చిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పీఏసీ ఛైర్మన్‌గా కూడా చేయడం ఈ మధ్య కాలంలో పెను వివాదానికి కారణమైంది. ఆ టైంలో కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య తీవ్ర వార్ నడిచింది. తాను ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ అరికెపూడి వాదిస్తుంటే...లేదు పార్టీ మారుతున్నట్టు కండువా కూడా మార్చుకున్నారని ఆరోపిస్తూ వస్తోంది బీఆర్ఎస్. ఈ వివాదాలు నడుస్తుండగానే అసెంబ్లీ సెక్రటీ అభ్యర్థను హైకోర్టు డివిజన్ బెంచ్ తిరస్కరించడంతో తర్వాత ఏం జరగనుందనే ఆసక్తి మొదలైంది.

## మూసీ కూల్చివేతలకు బ్రేక్.. ఎందుకంటే

**హైదరాబాద్ :** మూసీ సుందరీకరణ ప్రాజెక్టలో భాగంగా మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపుకు బ్రేక్ పడింది. శంకర్ నగర్, మూసానగర్‌లో స్థానికులు ఇళ్ళు ఖాళీ చేయకపోవడంతో అధికారులు కూల్చివేతలను నిలిపివేశారు. ఈ కూల్చివేతలకు రెవెన్యూ అధికారులు తాత్కాలిక బ్రేక్ ఇచ్చారు. ఓల్డ్ మలక్‌పేట్, శంకర్‌నగర్‌లో 450 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు 140 ఇళ్లు కూల్చివేసి బాధితులను చంచల్‌గూడలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లకు తరలించారు. ఖాళీ చేసిన ఇళ్లను ఇప్పటి వరకు అధికారులు కూల్చివేశారు. అయితే కొంతమంది బాధితులు డబుల్ బెడ్రూమ్ ఇళు కేటాయించినప్పటికీ ఖాళీ చేయని పరిస్థితి. హైదరాబాద్ శివారులో డబుల్ బెడ్‌రూంలు కేటాయించారని.. ఒక్కో ఇంట్లో 16 మంది ఉన్న వారికి డబుల్ బెడ్ రూంలు ఏం సరిపోతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంతా ఇళ్లు ఖాళీ చేయని నేపథ్యంలో అధికారులు కూల్చివేతలకు కాస్త బ్రేక్ ఇచ్చారు. అయితే బాధితులకు డబుల్ బెడ్ రూమ్‌తో పాటు 25 వేల సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తున్న విషయం తెలిసిందే. కాగా.. ఆపరేషన్ మూసీలో భాగంగా రెండు రోజుల క్రితమే మూసీపరివాహక ప్రాంతాల్లో ఇళ్లను కూల్చివేసే పనులను ప్రారంభించారు రెవెన్యూ అధికారులు. %=దీ- ౩% అని రాసి, ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేస్తున్నారు. ఎలాంటి అవాంతరాలు జరుగకుండా భారీ బందోబస్తు నడుమ ఇళ్లను కూల్చివేశారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌ను వరదల నుంచి రక్షించేందుకు, ఆక్రమణకు గురైన మూసీ నది పరివాహక ప్రాంతాలను పునరుద్ధరించి, కాలుష్య కోరల నుంచి మూసీని కాపాడేందుకు ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.అధికారులు ముందుగా మూసీ నది ఎఫ్‌టీఎల్ పరిధిని సర్వే చేశారు. అందులో దాదాపు 16 వేల నివాసాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు తేలింది. అందులో పేద, మధ్యతరగతి వారు నివసిస్తున్నారు. దీంతో ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలకు ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకోసం ఇప్పటికే జీఓ కూడా జారీ చేసింది. అయితే డబుల్ బెడ్రూమ్‌లు ఎవరికి ఇవ్వాలనే దానిపై తాజాగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి.. గుర్తించి ఇళ్లపై అని రాశారు.

# మూడు రోజుల క్రితం అధికారులు వచ్చిమా యొక్క షాప్‌లు కులగొట్టారు...





**30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేసుకోవడం జరుగుతుంది, ప్రభుత్వ అరాచకం**

**తెలంగాణగీతం వనస్థలి** పురం రైతు బజార్ దగ్గర పూలు,పండ్లు తదితర వ్యాపారం చేసుకునే వర్తకులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వారి యొక్క క్యాంపు కార్యాలయంలో కలవడం జరిగింది.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మేము దాదాపు 30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.మూడు రోజుల క్రితం అధికారులు వచ్చి మా యొక్క షాప్ లు కులగొట్టడం జరిగింది అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మా యొక్క డబ్బాలు,షాప్ లు,తోపుడుబండ్లు



కులగొట్టడం జరిగింది అని రోదిస్తూ సుధీర్ రెడ్డిని విన్నపించుకున్నారు.ఇప్పుడు మా బతుకులు రోడ్డు మీద పడ్డాయి.మాకు న్యాయం చేయండి అని కోరారు.మీరు లేని సమయంలో మాకు అన్యాయం జరిగిందని తెలిపారు. అనంతరం సుధీర్ రెడ్డి ప్రతి ఒక్కరిని పలకరిస్తూ నేను గత మూడు నెలల నుంచి అస్వస్థతకు గురై హాస్పిటల్ నందు చేరిక కావడం వల్ల ఇట్టి నియోజకవర్గనికి రాలేక పోవడం జరిగింది అని గుర్తు చేశారు.మీ యొక్క సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అధికారులచే మాట్లాడి ఒక పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్,చిరంజీవి,సత్తిరెడ్డి,సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలి

**కమాన్ పూర్ :** పరిశ్రమల్లో పరిశుభ్రత పాటించాలని సుధాకర్ రావు అన్నారు. ఆర్జిఓసీఎం 1, ఆర్జి3 ఏరియా భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు బొగ్గు పరిశ్రమలలో పరిశుభ్రత పాటించాలనే తలంపుతో స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని రూపొందించి నిర్వహించడం జరుగుతుంది. సింగరేణి సంస్థ వ్యాప్తంగా కూడా ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీ నుండి ప్రారంభించుకోవడం జరిగింది. అందులో భాగంగా గురువారం ఓసీ1 బేస్ వర్క్ షాప్ నందు స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఓసీ1 బేస్ వర్క్ షాప్ లో మొక్కలు నాటారు అనంతరం పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఓసీ 1 ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్. రాధా కృష్ణ మాట్లాడుతూ... ఈ 15 రోజులే కాకుండా ప్రతి రోజు కూడా పరిశుభ్రతను విధిగా ఆచరించాలని తమ ఇంటిలో, ఆఫీసులో ఈ స్వచ్ఛ్ కార్యక్రమాన్ని చేపట్టి ఆరోగ్యకరమైయన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు మాట్లాడుతూ... మహాత్మా గాంధీ స్వాంతంత్ర్యం కంటే పరిశుభ్రత ముఖ్యం అనేవారు అని గుర్తు చేశారు. దీనిని అనుసరించి మన భారత ప్రభుత్వము స్పెషల్ క్యాంపెయిన్



4.0 కార్యక్రమాన్ని 30 రోజుల పాటు నిర్వహిస్తుందని అన్నారు. దీని ద్వారా బొగ్గు పరిశ్రమలలో అవగాహన తీసుకువచ్చి పరిశుభ్రమైన పని స్థలాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన పరిసరాలు నిర్మించుకుంటే అవే అభివృద్ధికి పునాదులౌతాయని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ తమ పరిధిలో శుభ్రత పాటిస్తూ, పరిసరాలను కూడా శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని హితవు పలికారు. స్వచ్చతా అనేది మన జీవన విధానంగా మారాలని అన్నారు. ప్రతి వ్యక్తి పరిశుభ్రత పాటించినట్లైతే తన కుటుంబంతో పాటు ఆ సమాజం / గ్రామం కూడా పరిశుభ్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడూ మనసు కూడా ఆహ్లాదకరంగా ఉంటుందని, పనిలో కూడా శ్రద్ద పెరిగి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారముండదని అభిప్రాయపడ్డారు. ఓసీ 1 ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్.రాధా కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజీఎం శ్రీ జి. రఘుపతి, మేనేజర్ ఉదయ్ హరిజన్, ఐఎన్‌టియూసి పిట్ సెక్రెటరీ సదానందం, ఏఐటియూసి పిట్ సెక్రెటరీ రమేష్, ఏరియా ఎన్విరాన్మెంట్ అధికారి పి.రాజా రెడ్డి, డివైఎస్ఈ సివిల్ రాజేంద్ర ప్రసాద్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఫారెస్ట్ అధికారి కల్యాణ్, ఓసీ 1 ఎన్విరాన్మెంట్ అధికారి కిషన్, బేస్ వర్క్ షాప్ హెచ్ఓడి జివి సత్యనారాయణ, సంక్షేమ అధికారి సాయికృష్ణ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఫార్మాలో ఒక్క రైతును నష్టపోనివ్వం

**రంగారెడ్డి :** మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం ఫార్మా సిటీలో భూములు కోల్పోయిన రైతులకు అందరికీ న్యాయం చేస్తామని మరోసారి స్పష్టం చేశారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. వీరితో పాటు రావిర్యాల - జెన్నాయిగూడ రైతులు సైతం కేఎల్ఆర్ ను తుక్కుగూడ కార్యాలయంలో కలిశారు. అధికారులు, స్థానిక నాయకులతో చేర్చించి... ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం, గతంలో ఇచ్చిన పట్టాలు, అభివృద్ధిపై పేదలకు భరోసా ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎవరైనా... ఇల్లీగల్ గా స్థలాలు పొందినా వారిని గుర్తించి లిస్ట్ నుంచి తొలగించాలని కేఎల్ఆర్ తెలిపారు.20 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న జెన్నాయిగూడ భూనిర్వాసితులకు ఒకే చోట ప్లాటింగ్ చేసి ఇచ్చేలా ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని కిచ్చెన్నగారు హామీ ఇచ్చారు.కందుకూరు మండలం 4 గ్రామాల్లో ఫార్మాలో భూములు కోల్పోయిన వారికి ఫ్లాట్లు - పరిహారం వచ్చేలా చూడాలని కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డికి సూచించారు. అందుకు సంబంధించిన లీగల్, ప్రభుత్వ పరమైన సమస్యలపై దృష్టి పెట్టి ఫార్మా రైతులకు అండగా ఉండాలని బొక్క జంగారెడ్డికి చెప్పారు. అనంతరం వివిధ సమస్యలపై వచ్చిన నియోజకవర్గం



ప్రజలతో మమేకం అయ్యారు కేఎల్ఆర్. సమస్యలు లేని మహేశ్వరం కావాలని లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

# కొండా సురేఖ వివాదాన్ని ముగిద్దాం

## సినీ ప్రముఖులకు కాంగ్రెస్ విజ్ఞప్తి

**హైదరాబాద్ :** తెలుగు పరిశ్రమలో పెను దుమారం రేపిన మంత్రి కొండా సురేఖ కామెంట్స్ చిచ్చు ఇంకా చల్లారలేదు. దీనిపై అమె ఒకడుగు వెక్కి తగ్గి వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నా సినిమా ఇండస్ట్రీ నుంచి ఎదురుదాడి కొనసాగుతూనే ఉంది. ఫిల్మ్ ఛాంబర్ కూడా ప్రత్యేకంగా సమావేశమై దీనిపై చర్చించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అయితే ఈ వివాదానికి ముగింపు పలకాలని కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. కొండాసురేఖ తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నందున ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని సినీ ప్రముఖులను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఇరు వైపుల కూడా మహిళలే ఉన్నందున అర్థం చేసుకొని శాంతించాలని కోరారు. తప్పును గ్రహించి కొండా సురేఖ వెనక్కి తగ్గారన్నారు. అందుకే వివాదాన్ని ముగిస్తే సమంజసంగా ఉంటుందన్నారు. అదే టైంలో కొండా సురేఖపై కేటీఆర్ చేసిన కామెంట్స్, ట్వీట్‌లను కూడా పరిశీలించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు, మంత్రులు, కాంగ్రెస్ కార్యకర్తలకి కూడా మహేష్ కుమార్ గౌడ్ పలు



సూచనలు చేశారు. వివాదాల జోలికి పోవద్దని సూచించారు. ఏదైనా విషయంపై మాట్లాడే టైంలో జాగ్రత్తగా ఉండాలని హితవుపలికారు. పదాలు వాడే క్రమంలో కంట్రోల్డ్‌గా ఉండాలన్నారు. మరోవైపు కేటీఆర్‌పై తీవ్రంగా విమర్శలు చేసే క్రమంలో అక్కినేని ఫ్యామిలీ, సమంతపై కొండ సురేఖ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి పెను దుమారానికి కారణమయ్యాయి. ఆమె మీద ఫైర్ అవుతూ తెలుగు ఇండస్ట్రీలోని పెద్దలంతా గళం విప్పారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి కామెంట్స్ చేయడం ఏంటని ప్రశ్నించారు. అటు అక్కినేని ఫ్యామిలీ కూడా తమను రాజకీయాల్లోకి లాగొద్దని అభ్యర్థించారు. సమంత కూడా ఘాటుగా స్పందించారు.

వివాదం ముదురుతుందని గ్రహించిన తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. బుధవారం రాత్రి కొండా సురేఖతో మాట్లాడి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టే చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో వెంటే సమంతను ట్యాగ్ చేస్తూ కొండా సురేఖ ట్వీట్ చేశారు. తను తప్పుగా మాట్లాడినట్టు అనిపిస్తే తన కామెంట్స్‌ను వెనక్కి తీసుకుంటానంటూ చెప్పుకొచ్చారు. నా వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఒక నాయకుడి చిన్నచూపు ధోరణిని ప్రశ్నించడమే కానీ మీ మనోభావాలను దెబ్బతీయడం కాదు.స్వయం శక్తితో మీరు ఎదిగిన తీరు నాకు కేవలం అభిమానం మాత్రమే కాదు.. ఆదర్శం కూడా.

## మునగానూర్ గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు...

**హయత్ నగర్ జోన్... అక్టోబర్ 2** తుర్కయంజల్ మున్సిపాలిటీ మునగనూరు ఒకటో వార్డ్ లోని పకృతి వనం కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు, కాలనీ వాసులు అందరూ కలిసి బతుకమ్మను తీరక్కపూవ్వు తెచ్చి బతుకమ్మ పేర్చి అందులో గౌరమ్మని పెట్టి అందరు కలిసి బతుకమ్మ ఆడడం జరిగినది, తెలంగాణ సాంప్రదాయంగా ఆడపడుచులు అందరు కలిసి ఒక దగ్గర చేరి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు అనంతరం బతుకమ్మను గంగమ్మ ఒడికి చేర్చారు, రావుల యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో ఒకటో వార్డ్ కౌన్సిలర్ తాళ్లపల్లి సంగీతమోన్ గుప్త పాల్గొని గౌరమ్మకి కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ప్రకృతి వనం కాలనీ అధ్యక్షుడు రావుల యాదగిరి గౌడ్, అడ్వైజర్ కందుల వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కొమ్మిడి రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ రామినేని రాజు, జాయింట్ సెక్రెటరీ చింటూ, ట్రెజరర్ భూపాల్ రెడ్డి, ఆర్గనైజర్ స్వర్ణలత, మెంబర్స్ శివ, సురేందర్ రెడ్డి, కట్ట శ్రీనివాస్ రెడ్డి, గజ్జి మల్లేష్ యాదవ్, కోటయ్య, నరేష్ నాయుడు, అజయ్ రెడ్డి,రఘు, అశోక్, రవి చందర్, సత్యానంద్,మధు, కుమారస్వామి,సందీప్, కిరణ్ కాలనీ సభ్యులందరూ పాల్గొన్నారు

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ఏల్ బి నగర్ జోన్ తెలంగాణగీతం అక్టోబర్ 3** వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో ఘనంగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలిచే బతుకమ్మ పండుగను ఆడపడుచులు ఘనంగా జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ మొదటి రోజు కావడంతో ఎంగిలి పూల బతుకమ్మతో తెలంగాణ వ్యాప్తంగా పల్లె, పట్నం, ఊరు వాడ,కాలనీలో, బతుకమ్మతో అందరూ ఒక్క దగ్గరికి చేరి బతుకమ్మ పాటలు పాడుకుంటూ కోలాటాలతో నృత్యాలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని బతుకమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమం లొ పాల్గొన్న విజయ, సునీత, రజిత, స్వప్న కాలనీ వాసులు పాల్గొన్నారు

## బీసీ కమిషన్ మెంబర్ రంగు బాలలక్ష్మినీ కలిసిన ఆర్టీఐ కమిటీ



**హైదరాబాద్ ఎల్.బి నగర్ తెలంగాణగీతం అక్టోబర్ 3:-** బీసీ కమిషన్ మెంబర్ రంగు బాలలక్ష్మి నీ వారి ఆఫీసులో ఆర్టిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్,రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు గురువారం కలిసి సన్మానించారు. సమాచార హక్కు చట్టాన్ని బలోపేతం చేసి ప్రజలకు అందు బాటులోకి తేవాలని బాలా లక్ష్మిని కోరారు. అక్టోబర్ నెల చివరలో నిర్వహించే ఆర్టీఐ ఆవిర్భావ వేడుకలకు మరియు అవగాహన సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రజలకు, విద్యార్థులకు ఆర్టిఐ అవగాహన సదస్సులు పెట్టి ప్రజలను మరింత చైతన్యవంతులను చేయాలని, దీనికి మీ సహాయ సహకారాలు కావాలని విన్నవించారు. దీనికి ఆమె ఇలాంటి అవగాహన కార్యక్రమాలు పెట్టడం ప్రజలకు ఆర్టీఐ గురించి వివరించే కార్యక్రమం పెట్టడం చాలా బాగుంటుందని ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ బృందం ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతమైన వాతావరణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

**సిద్దిపేట :** అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించాలి జిల్లాలో దుర్గామాత మండపాలు ఏర్పాటు చేసే ఆర్గనైజర్ లకు, మండపాల నిర్వాహకులకు, కార్యవర్గ సభ్యులకు పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, పాటించవలసిన నియమ నిబంధనల గురించి తగు సూచనలు చేశారు.జిల్లాలో మొత్తం దుర్గామాత విగ్రహాలు 664, ఏర్పాటు చేయడం జరిగింది. దుర్గామాత ప్రతిష్టచాలనుకునే వారు సంభందింత పియస్ నుండి అనుమతి తీసుకోవాలి. ఎలక్ట్రిసిటి డిపార్ట్మెంట్ వారి పర్మిషన్ తీసుకుని కరెంటు వాడాలి దుర్గామాత మండపం రోడ్డు ప్రక్కన గాని ఖాళీ స్థలంలో గాని నిర్మించాలి. విగ్రహం యొక్క స్టేజి కింద ఎలాంటి వస్తువులు ఉంచరాదు మండపాల వద్ద తగినంత సంఖ్యలో స్థానిక సత్ప్రవర్తన కలిగిన వాలంటీర్లను నియమించి వాడు భక్తులను క్రమబద్ధీకరించే విధంగా చూడవలెను. దుర్గామాత మండపాలను మంచి నాణ్యత కలిగిన వస్తువుల తో ఏర్పాటు చేయవలెను మండపం మూడు వైపులా టార్పాలిన్ తో కప్పవలెను. మండపాలకు నాణ్యత కలిగిన వైరుతో కరెంట్ కనెక్షన్ ఇవ్వవలెను. వివాదాస్పద ప్రదేశాలలో మండపాలు ఉండకూడదు. ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలిగించరాదు.

## డిజిటల్ కార్డు సర్వేను సక్రమంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి :** డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం గణపురం మండలం బుర్రకాయలగూడెంలో జరుగు తున్న డిజిటల్ కార్డు సర్వే ప్రక్రి యను గురువారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు, గణపురం మండలంలోని బుర్రకాయలగూడెం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో జరుగుతున్న సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారిగా ఆర్డిఓ మంగిలాల్ ను నియమించామని తెలిపారు. మున్సిపల్, బుర్రకాయలగూడెం లలో జరుగుతున్న సర్వే ప్రక్రియ కు రెండు టీములు ఏర్పాటు చేశామని, ప్రతి టీముకు ముగ్గురు సిబ్బందిని నియమించి నట్లు తెలిపారు. అవసరం మేరకు సర్వేకు అదనపు టీములు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ పద్ధతిన అమలు చేయనున్న కుటుంబానికి డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియలో కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని అన్నారు.